'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

వక్రంగా ఆలోచిస్తే కూలేది వాళ్ల భవితే..!

రాజేంద్రప్రసాద్ చేలిక
99858 35601

కాళేశ్వరం.. ఓ వాస్తవం. గిట్టనివారికి కండ్లముందు కనిపించే చేదు నిజం. నీరు వరప్రదాయిని. ఒడిసి పడితే మనుగడ.. వదిలేస్తే కొట్లాడే దుబ్బలో మునుగుడే కదా. కొద్ది కాలమే అవకాశం.. అప్పుడే దాచుకోవాలి.. వాడుకోవడానికి నిల్వ చేసుకోవాలి. దశాబ్దాలుగా చినుకు రాలడం.. తెలంగాణ రైతాంగం నుదుటన మృదువుగా స్పృశించడం.. చిన్నబోతున్న విషణ్ణవదనాలతో మట్టిని ముద్దాడటం.. ఆపేవారు లేక, అక్కరకు రాకుండా పోతున్నాననే దిగులుతో జారుతూ సంద్రాన కలువడం.

నాడు వలస పాలకుల తీరుతో దు:ఖించడానికి కూడా కన్నీళ్లు ఇంకిన రోజులతో కాలం వెల్లబీయాల్సిన దౌర్భాగ్యపు స్థితి తెలంగాణది. బతికి చెడిన రోజులను తల్చుకుంటూ, చెడి బతకాల్సిన దుస్థితిని తట్టుకోలేక పట్టెడన్నం పెట్టే రైతులు పిట్టల్లా రాలుతున్నా దిగమింగుకోవాల్సిన దౌర్భాగ్యం.

రాజకీయం ఎప్పటికీ ఉండేదే.. పాలకుల స్వభావం మారుతూ కనిపించేదే. మారాల్సినవి మార్చకుండా, మారకూడని వాటికోసం సమయాన్ని వృథా చేసుకోవడం కన్నా హీనం మరోటి లేదనే విషయాన్ని అర్థం చేసుకున్న వారు అతి కొద్దిమందే ఉంటారు. జరిగిందేమిటి? జరగాల్సింది ఏమిటి? అనే దూరాలోచన ఉన్నవారే జంకు, బొంకు లేకుండా చేయాల్సింది చేయడానికి సంకల్పిస్తారు. కళ తప్పిన బతుకులు.. కళావిహీనం చేసిన దగుల్బాజీలు.. కండ్లముందు కనిపిస్తున్న వనరులు. ఇవే ఆ మహనీయుడిని అప్పుడు ప్రేరేపించాయి.. ఉసిగొల్పాయి.. నడిపించాయి. బలం ఉన్నదా.. లేదా.. అనేది అప్పటి పరిస్థితులకు అప్రస్తుతం. సహకారం దక్కుతుందా, దక్కదా అనేది నాటి అవసరాల ముందు అనవసరం. సంకల్పం గట్టిదైనప్పుడు అడుగు పడుతుంది.. వనరులు సమకూరుతాయి.

ఏడు పదుల వయసున్న బలవంతపు కాపురానికి ఒక్కరంటే ఒక్కరూ ఒరగబెట్టింది లేదు. నీటికి ముకుతాడు వేసి మరీ తీసుకెళ్లే ప్రయత్నాలు చేసిన వారిని ఆపేవారు అంతకన్నా కరువయ్యారు. చీకట్లెన్ని అలుముకున్నా.. తాకట్లు ఎన్నిపెట్టినా.. ఆరోపణలు చేసినా.. అపవాదులు అంటగట్టినా.. వివాదాలు ముసిరినా.. విచారణలు జరిగినా.. కాళేశ్వరం ముమ్మాటికీ ఓ చరిత్రే.

మనుషులెవరు అనేది అక్కర్లేదిక్కడ, పార్టీ లేమిటనేది పట్టించుకోవాల్సిన అవసరం లేని ముచ్చట. ప్రయత్నానికి శ్రీకారం చుట్టినవారే కీలకం.. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా ఆపకుండా ముందుకు తీసుకెళ్లే భగీరథ ప్రయత్నాలే అతి ప్రధానం. నవ్వులపాలైన తీరును పూడ్చుకుంటూ, కొత్త ఇంటికి కావాల్సిన వాటిని సమకూర్చుకుంటూ వెళ్లినవారే ముఖ్యం.

తోలు కప్పుకున్నంత మాత్రాన పులవుతుందా? రంగుకు పులకించినంత తేలిగ్గా ఊసరవెల్లిని ఇష్టపడతారా? ఎత్తిపోసుడో.. దించిపోసుడో.. ఏదైతేనేం ఎక్కడిదో నీరు మరెక్కడెక్కడికో. ఎత్తని లేదు.. పల్లమని లేదు.. అన్నింటినీ తాకుతూ ప్రకృతి అందరికీ, సంపద ప్రతి ఒక్కరిది అన్నట్టుగా మొత్తం తెలంగాణకే తలమానికంగా మారిన ప్రాజెక్టు కాళేశ్వరం. నెర్రెలుబారిన చెరువులకు కళ ఎట్లా వచ్చిందో.. మండు వేసవిలో సైతం చిన్న కుంట కూడా నిండుకుండలా మారిన తీరు ఎలా సాధ్యమైందో రాష్ట్రం సాధించిన తర్వాత అంతా చూసిందే, అందరికీ తెలిసిందే. దూప తీర్చాలి.. నేలమ్మ కడుపు పండాలనేది కేసీఆర్ కట్టుకున్న కంకణం.. పెట్టుకున్న లక్ష్యమనేది గుర్తించి యావత్ ప్రపంచమే కొనియాడింది. ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాలను ఆయన సమీక్షించిన విధానం.. సహకారం కోసం తపన పడిన సారు తీరును అంతా శ్లాఘించారు. కానీ, చూడలేక కండ్లు మూసుకున్న వారూ కోకొల్లలు అనేది కాలక్రమేణా తేటతెల్లమైంది.

మునిగితే తేల్చాల్సిన అవశ్యం ఉంటుంది. కూలితే నిలబెట్టాల్సిన తరుణాన్ని ఆలోచించాలి. ప్రయోజనాలు పార్టీలకు ఆపాదించకుండా, శాశ్వతాలుగా, సర్వజనులు మెచ్చేవిగా చేస్తే చరిత్ర సృష్టించడం ప్రతి ఒక్కరికి సాధ్యమే అనేది కాలం నేర్పిన సత్యం. తాము చేస్తే ఎవరికో ఏదో దక్కుతుందని, ఆ కొద్ది వాటిని తామెందుకు మీదేసుకుని చేయాలనే వక్రంతో ఆలోచిస్తే ఒరిగేది మేడిగడ్డ కాదు.. కూలేది కాళేశ్వరం అంతకన్నా కాదు.. తప్పకుండా రైతుల ప్రయోజనాలే కూలుతాయి, జనం అవసరాలే కుంగుతాయి.

సమయం చాలా వేగవంతమైనది. అన్నింటికీ అదే పరిష్కార మార్గాలను చూపుతుందనడానికి జరుగుతున్న ఘటనలే సాక్ష్యం. విచారణలు జరగనీ గాక.. వేధింపులు, సాధింపులు కొనసాగనీ గాక.. దిద్దుబాట్లు చేయకుండా నింపాదిగా గడుపుతామంటే గుర్తుపెట్టుకోవడం ఏమోగానీ, గుర్తులే లేకుండా చేసే మొండి బలం ముమ్మాటికీ కాలానికే ఉన్నది. కోట్లాది జనాభాకు అన్యాయం జరుగుతున్నదని గగ్గోలు పెట్టేవారు ఒక్కరి కోసమో, కుటుంబం కోసమో పరిస్థితినంతా ఉపేక్షిస్తూ, నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తే అది పరాయిపాలవుతూనే ఉంటుంది. బతుకులు 'ఎప్పటి చిప్ప ఎనుగుల్నే' అన్నట్టుగా మారుతాయి.

గుంట భూమిలో కట్టే ఇంటిగోడలకే కాలక్రమేణా బీటలు వారడం సహజం. ఒక్కరిద్దరితో పని చేసే కట్టడంలోనే లోపాలు పొడసూపడం అతిసాధారణం. అంతమాత్రాన ఆ కట్టడమే తప్పు.. ఈ ఒక్కరిద్దరితోనే తలనొప్పి.. అంటూ తిడుతూ కూర్చుంటే ఒరిగేదేముండదు.. సాగేది అంతకన్నా లేదనేది జగమెరిగినదే. అలాంటిది అంతటి మహా కట్టడంలో ఆ మాత్రం లోపాలను వల్లె వేస్తూ కాలాన్ని సాగదీయడం ఎంతటి విచిత్రమో మేధావులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ఉపాయం ఆలోచించాలి.. ప్రత్యామ్నాయం కనుగొనాలి.. బుంగలో, బీటలో పూడ్చాలి. ఇంకా ఏమైనా ఉంటే సరిదిద్దాలి. అటు దాని పని దానిదే.. ఇటు వీరి పని వీరిదే అన్నట్టుగా సాగిస్తే శభాష్ అంటారు తప్ప, కక్ష సాధింపు నెపంతో ఒకే కక్ష్యలో తిరిగితే బొక్కబోర్లా పడటం ఖాయం. పల్లమెరిగిన నీటికి పైకెరగడం చూపిన నేర్పరిని పలుచన చేయాలనే నిషాలో, అదే పైకి చూస్తూ కింద నడుస్తామంటే మునిగేదెవరో మేధావులకు తెలియనిది కాదు. ఏదేమైనా నీరు ఉన్నంత వరకు కాళేశ్వరం.. ప్రాజెక్టు పగలబడి నవ్వినన్నాళ్లు పంటలు పచ్చగా కళకళలాడుతుంటాయి. గొప్ప మనుషుల ఆలోచనలు ఎప్పుడూ చరిత్రగానే మిగులుతాయి. ■

భారత్ చుట్టూ అమెరికా ఉచ్చు

ఎడిటోరియల్ డెస్క్

ఆపరేషన్ సిందూర్ గురించి ప్రధాని మోదీ ఎన్నికల ర్యాలీల్లో పుంఖానుపుంఖాలుగా ప్రసంగిస్తున్నప్పటికీ, అందుకు భిన్నంగా ప్రపంచవ్యాప్తంగా ఆయన ప్రభ తగ్గిపోతున్న సూచనలే అంతకంతకు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ విషయంలో అంతర్జాతీయంగా భారత్ వాణిని వినిపించేందుకు, మన వైఖరిని తెలియజేసేందుకు ఆయన స్వరం సరిపోలేదు. ఒక్కరినే కాదు, అనేక సిద్ధాంతాలు, సమాజాలను భారత స్వరం ప్రతిబింబించాలని మోదీ చాలా ఆలస్యంగానైనా గుర్తించారు. అందుకే, అఖిలపక్షం ఎంపీల బృందంలో విభిన్న వర్గాలు హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు, కాంగ్రెస్‌వారు, మార్క్సిస్టు, ద్రవిడవర్గాల ప్రతినిధులను ఎంపిక చేశారు. ఈ వాస్తవాన్ని మోదీ పరిగణనలోకి తీసుకోవడమే గత పదకొండేండ్లలో ఆయన ప్రభ తగ్గిందని చెప్పేందుకు తార్కాణం. మొన్నటివరకు ప్రతిపక్షాలను చిన్నచూపు చూసిన మోదీ ఇప్పుడు అఖిలపక్ష బృందాన్ని సాదరంగా స్వాగతించి, సత్కరించాల్సి వచ్చింది. అయితే, ఈ క్రమంలో మింగుడు పడని అంశం ఏమిటంటే.. సైనిక కార్యకలాపాల నేపథ్యంలో భారత వ్యూహాత్మక దుర్బలత్వాలు ప్రపంచానికి బహిర్గతమయ్యాయి.

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టడాన్ని బహిరంగంగా స్వాగతించిన అతికొద్ది ప్రధాన దేశాల్లో భారత్ కూడా ఒకటి. అయితే, ట్రంప్ 2.0లో ఐదు నెలలు కూడా గడవకముందే ఇరుదేశాల మధ్య ఉన్న ఈ సద్భావన వాతావరణం సన్నగిల్లుతున్నట్టు సంకేతాలు వెలువడుతున్నాయి. అమెరికా ఎన్నికల్లో ట్రంప్‌నకు బలంగా మద్దతిచ్చిన పలువురు భారత సంతతి వారు తాము తప్పు చేశామా? అని ఇప్పుడు పునరాలోచనలో పడ్డారు.

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ గెలుపొందినప్పుడు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆందోళన చెందాయి. వాణిజ్యపరంగా ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తవచ్చని కానీ, వ్యూహాత్మక చర్చల ద్వారా దాన్ని అధిగమించవచ్చని భారత్ కూడా భావించింది. రష్యా పట్ల ట్రంప్ ఆచరణాత్మక వైఖరి, ఇజ్రాయెల్-హమాస్ మధ్య శాంతి కోసం ప్రయత్నించడం, గ్లోబల్ పవర్‌గా ఎదుగుతున్న భారత్ పట్ల ఆయన సానుకూల దృక్పథంతో ఉండటాన్ని చాలామంది భారతీయులు ప్రశంసించారు. ట్రంప్ హయాంలో ఇండియా-అమెరికా బంధం మరింత బలపడాలని కూడా ఆకాంక్షించారు. ఈ మేరకు వాల్ స్ట్రీట్ జర్నల్‌కు రాసిన వ్యాసంలో బార్డ్ కాలేజిలో విదేశాంగ విధానం విభాగం ప్రొఫెసర్ వాల్టర్ రస్సెల్ మీడ్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. అయితే, అందుకు విరుద్ధంగా ట్రంప్ 2.0లో దౌత్యపరంగా అసంతృప్తిని రేకెత్తించిన వరుస చర్యలతో భారతదేశం దిగ్భ్రాంతికి గురైంది. ట్రంప్ రెండవ విడత పాలన ప్రారంభంలో భారతీయ పౌరుల బహిష్కరణలను మీడ్ ఎత్తిచూపారు. ట్రంప్ పాలన మొదటి పర్యాయంలో దాదాపు 6 వేల మంది భారతీయులను అమెరికా నుంచి బహిష్కరించారు. కానీ, ఈసారి అక్రమ వలసదారుల పేరిట బహిష్కరణకు గురైన వారిని సంకెళ్లు వేసి మరీ సైనిక విమానంలో స్వదేశానికి తరలించారని వాల్టర్ గుర్తుచేశారు. దీనిపై భారత్‌లో రాజకీయ దుమారం చెలరేగింది.

2025 మే 27న ఓ విద్యార్థి వీసా ఇంటర్వ్యూ షెడ్యూల్‌ను విదేశాంగ శాఖ అకస్మాత్తుగా నిలిపివేయడంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఐఫోన్ల ఉత్పత్తిని చైనా నుంచి భారతదేశానికి తరలించాలనే యాపిల్ కంపెనీ ప్రణాళికలపై ట్రంప్ బహిరంగ విమర్శలను కూడా మీడ్ ఉదహరించారు. భారత్ ప్రాముఖ్యతను అమెరికా తగ్గించివేస్తున్నదనే భావనను ఇది మరింతగా పెంచింది. పహల్గాంలో ఉగ్రవాద దాడి, అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలపై ట్రంప్ సర్కార్ ప్రతిస్పందన భారత్‌లో అసంతృప్తిని రేకెత్తించింది. 'రాడికల్ జిహాదిస్ట్ ఉగ్రవాదానికి పాకిస్తాన్ ప్రధాన మద్దతుదారు. ఉగ్రవాదులకు ఆ దేశం నిధులు కూడా సమకూరుస్తున్నది. ఉద్రిక్తతల విషయంలో రెండు వైపులా శాంతించాలనే ప్రకటనల కంటే అమెరికా నుంచి భారతీయులు ఎక్కువ ఆశించారు' అని ప్రొఫెసర్ వాల్టర్ తన వ్యాసంలో

రాశారు. కాల్పుల విరమణ కోసం మధ్యవర్తిత్వం వహించానని ట్రంప్ పదేపదే పేర్కొనడం, క్రెడిట్ కోసం పాకులాడటం ఈ పరిస్థితిని మరింత దిగజార్చింది. ఇంకా చెప్పాలంటే, ఇది భారత ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టివేసింది.

భారత్‌ను అమెరికా చూసే కోణం విషయంలో భారతీయుల్లో అసంతృప్తి ఉన్నది. పాక్ రెండవ లేదా మూడవ శ్రేణి శక్తిగా ఉన్నది. ఆర్థిక, రాజకీయ వైఫల్యాలతో ఆ దేశం ప్రపంచ వేదికపై చర్చనీయాంశమవుతున్నది. కానీ, భారత్ భిన్నపథంలో ఉన్నది. ఈ విజయాన్ని గుర్తించాలని భారతీయులు కోరుకుంటున్నారు. ముఖ్యమైన ప్రపంచ శక్తిని ట్రంప్ దూరం చేసుకోవడం మంచిది కాదని, అనవసరంగా కాళ్లల్లో కట్టెలు పెట్టడం వల్ల 'అమెరికా గ్రేట్ ఎగైన్'గా మారదని వాల్టర్ అన్నారు.

మరోవైపు ఒక్కరోజు వ్యవధిలోనే అమెరికా చేతుల్లో భారత దౌత్యానికి వరుసగా ఎదురుదెబ్బలు తగిలాయి. అమెరికా ఆర్మీ డే సందర్భంగా వాషింగ్టన్ డీసీలో నిర్వహించే కార్యక్రమానికి పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌ను ఆహ్వానించడం అందులో ఒకటి. పహల్గామ్ ఉగ్రవాద దాడికి ముందు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన మునీర్‌ను ఆహ్వానించడం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. ఉగ్రవాదంపై పోరాటంలో అమెరికాకు పాకిస్థాన్ 'గొప్ప భాగస్వామి', ఉగ్రవాదంపై పాక్ అద్భుతంగా పోరాడుతున్నదని కితాబిస్తూ, దాయాదికి అమెరికా ఆర్మీ సెంట్రల్ కమాండ్ అధిపతి మైఖేల్ కురిల్లా క్లీన్‌చిట్ ఇచ్చేశారు. ఇది భారత దౌత్యానికి తగిలిన మరో ఎదురుదెబ్బ. ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతున్నదని మోదీ ప్రభుత్వం పదేపదే చెప్తున్నది. ఇలాంటి సమయంలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌ను అమెరికా అతిథిగా ఆహ్వానించడం ఆందోళనకరం. భారత్‌తో అమెరికా సంబంధాలు కలిగి ఉన్నంత మాత్రాన ఇస్లామాబాద్‌తో సత్సంబంధాలు కలిగి ఉండొద్దా? అని కురిల్లా ఈ సందర్భంగా ప్రశ్నించారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధి బృందం అమెరికాను సందర్శించిన కొన్ని రోజులకే కురిల్లా ఇలా వ్యాఖ్యానించడం గమనార్హం.

మరోవైపు బంగ్లాదేశ్‌లో ఒక పెద్ద భౌగోళిక రాజకీయ మార్పు జరుగుతున్నది. 'గ్రేట్ గేమ్'గా పిలుస్తున్న దీని ప్రధాన వ్యూహకర్త అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అని తెలుస్తున్నది. బంగ్లాదేశ్‌తో ఉన్న 271 కిలోమీటర్ల సరిహద్దు సహా మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రాన్ని అరకాన్ సైన్యం నియంత్రిస్తున్నదని రక్షణ నిపుణుడు బ్రహ్మ చెల్లానీ చెప్తున్నారు. మయన్మార్‌లో ప్రతిపాదిత మానవతా కారిడార్ రోహింగ్యాలకు సహాయం చేయడానికి మాత్రమే కాదని, అమెరికా నేతృత్వంలో భౌగోళిక, రాజకీయ వ్యూహంలో భాగం కావచ్చని నిపుణులు వాదిస్తున్నారు. వాస్తవానికి ఇది రోహింగ్యాలను వ్యతిరేకించే తిరుగుబాటు సంస్థ అరకాన్ ఆర్మీ నియంత్రణలోకి వస్తుందనేది నిపుణుల వాదన. ఈ కారిడార్ అసలైన లక్ష్యం తిరుగుబాటుదారులకు సైనిక సహాయం అందించడమేనని తెలుస్తున్నది. అమెరికా నాయకత్వంలో మయన్మార్ సైన్యానికి వ్యతిరేకంగా ప్రాక్సీ యుద్ధానికి ఆజ్యం పోయడానికి ఈ కారిడార్‌ను ఉపయోగించవచ్చనే ఆందోళనలు తలెత్తుతున్నాయి. మయన్మార్‌లోని వివిధ తిరుగుబాటు గ్రూపులకు అమెరికా ఇప్పటికే దాదాపు 400 మిలియన్ డాలర్ల సాయం చేసినట్టు సమాచారం. ఈ సహాయంలో కొంత భాగం, బహుశా ఆయుధాలతో సహా మణిపూర్‌లోకి కూడా వచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు అమెరికా చేతిలో పావుగా మారిన బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వాధినేత యూనుస్ భారత్‌కు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారు. భారత్‌కు నష్టం చేకూర్చే ఈ మానవతా కారిడార్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. అంతేకాదు, ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్‌కు కలిపి ఒక ప్రత్యేక అభివృద్ధి దృక్పథం అవసరమని ఇటీవల ఆయన వ్యాఖ్యానించారు.

ఈ నేపథ్యంలో భారత్‌కు వ్యతిరేకంగా అమెరికా ఇలా ఎందుకు చేస్తున్నదనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఈ ప్రశ్నలకు అమెరికా ఆర్థికవేత్త జెఫ్రీ శాక్స్ సమాధానమిచ్చారు. ప్రపంచ ఆధిపత్యాన్ని సవాలు చేసేంతగా ఏ దేశం ఎదిగినా అమెరికా దాన్ని అణగదొక్కాలని చూస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడైనా, భవిష్యత్తులోనైనా భారత్ గ్లోబల్ పవర్‌గా ఎదిగితే, దాన్ని బలహీనపరచడానికి అమెరికా ప్రయత్నిస్తుందని ఆయన చెప్పారు. గతంలో రష్యాతో అమెరికా వ్యవహరించినట్టుగా, ఇప్పుడు చైనాతో వ్యవహరిస్తున్నట్టుగా భారత్‌తోనూ అమెరికా వ్యవహరిస్తుందని ఆయన చెప్పడం గమనార్హం. గ్లోబల్ పవర్‌గా ఎదుగుతున్న శక్తులకు భావజాలం గురించి కాదు, ఆధిపత్యం గురించి అమెరికా సవాలు విసురుతుందని ఓ ఇంటర్వ్యూలో శాక్స్ స్పష్టం చేశారు. అమెరికా విదేశాంగ విధానాన్ని చాలా కాలంగా శాక్స్ విమర్శిస్తున్నారు. భారతదేశం తన ఆర్థిక పురోగతిని ఇలాగే కొనసాగిస్తే భవిష్యత్తులోనూ ఇదే పునరావృతమయ్యే అవకాశం ఉందని శాక్స్ కుండబద్దలు కొట్టారు. 10-15 ఏండ్లలో అమెరికాను అధిగమించి ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని, ఈ శతాబ్దం చివరికి అగ్రస్థానానికి చేరుకునే అవకాశం ఉందని శాక్స్ గతంలో అంచనా వేశారు.

'భారతదేశం ఎదిగినప్పుడు అమెరికా బలహీనపడుతుంది. అందుకే రష్యా, చైనాలాగా భారత్‌ను కూడా అమెరికా దెబ్బతీయాలని చూస్తున్నదని శాక్స్ అన్నారు. భారతదేశ ఆర్థిక పురోగతి అద్భుతమని ప్రశంసిస్తూనే, చైనాతో అమెరికా చేసే భౌగోళిక, రాజకీయ పోరులో భారత్ పావుగా మారకుండా జాగ్రత్తపడాలని శాక్స్ సూచించారు. చైనాను ఓడించేందుకు అమెరికా భారత్‌ను ఉపయోగించుకోవాలని చూస్తున్నదని, అమెరికా చేతుల్లో పావుగా మారవద్దని భారత్‌కు హితవు పలికారు.

అమెరికా నేతృత్వంలోని క్వాడ్ వంటి కూటముల్లో భారతదేశం భాగస్వామి కావడాన్ని శాక్స్ విమర్శించారు. అటువంటి గ్రూపులు ప్రధానంగా అమెరికా ప్రయోజనాలే పరమావధిగా పని చేస్తాయని, దీర్ఘకాలిక స్వయంప్రతిపత్తి విషయంలో భారత్ రాజీ పడేలా చేస్తాయని ఆయన వాదించారు. చైనా, రష్యా సహా అన్ని ప్రపంచ శక్తులతో సమతుల్య సంబంధాలను కొనసాగించాలని, వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని అనుసరించాలని శాక్స్ భారత్‌కు సూచించారు. సంక్లిష్ట సమయాల్లో మిత్రదేశాలను విడిచిపెట్టే అగ్రరాజ్యం బుద్ధిని, గత రికార్డును ఉటంకిస్తూ అమెరికాతో స్నేహం చాలా ప్రమాదకరమని శాక్స్ హెచ్చరించారు. అయితే, భారత్‌కు వ్యతిరేకంగా అమెరికా ఉచ్చు పన్నుతున్నా మోదీ సర్కారు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటంపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్నది. కశ్మీర్ విషయంలో మూడో పక్షం జోక్యాన్ని, సార్వభౌమాధికారం విషయంలో రాజీ పడటంపై ఇప్పటికే ప్రతిపక్షం మండిపడుతున్నది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, తదనంతర పరిస్థితులపై ప్రత్యేక పార్లమెంట్ సెషన్ నిర్వహించాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. అయినా మోదీ సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదు. ఉగ్రదాడి వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు రాజకీయం చేస్తూ పబ్బం గడుపుతున్నది. ■



రైతు కంటనీరు ప్రభుత్వానికి మంచిది కాదు. అబద్ధాలతో, ఆచరణసాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన ఏడాదిన్నరలో అన్ని వర్గాల ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేసింది. అనవసరపు ఆడంబరాలు, అక్కరకురాని డాంబికాలు ప్రదర్శించడం తప్ప కాంగ్రెస్ సర్కారు పనితనం ఎక్కడా కానరాలేదు. ముఖ్యంగా రాష్ట్ర రైతాంగం దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఎన్నికల ముందు వరంగల్ రైతుడిక్లరేషన్ పేరిట అన్నదాతలకు అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. నేడు వాటన్నింటికి తిలోదకాలిచ్చింది.

బోనస్ బోగసేనా?

కొనుకటి ప్రశాంత్
80084 92700

బీఆర్ఎస్ సర్కారు సాగునీరు, రైతుబంధు, నిరంతర ఉచిత విద్యుత్తు వంటి పథకాలు అమలు చేయడంతోపాటు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, సకాలంలో ఎరువులు, విత్తనాలు సరఫరా చేయడంతో వ్యవసాయ స్థిరీకరణ జరిగింది. తద్వారా వ్యవసాయ రంగం వృద్ధి చెంది రైతుల ఆదాయం పెరిగింది. రాష్ట్ర రైతాంగం పదేండ్లపాటు సుభిక్షంగా ఉన్నది. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. రైతులకు గడ్డుకాలం వచ్చింది. ఇప్పుడు రాష్ట్రంలో ఎటుచూసినా అన్నదాతల ఆక్రందనలే వినిపిస్తున్నాయి.

వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట రాహుల్‌గాంధీ సమక్షంలో అన్నదాతలపై వరాల జల్లును కాంగ్రెస్ కురిపించింది. వాటిలో ముఖ్యమైనది వడ్లకు బోనస్. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ రైతులను నమ్మించి ఓట్లు వేయించుకున్నది. తీరా అధికారంలోకి వచ్చాక సన్నరకం ధాన్యానికే ఇస్తామని కాంగ్రెస్ పాలకులు మాట మార్చేసి దగా చేశారు. ఈ యాసంగి సీజన్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేసి నెల రోజులు గడుస్తున్నా, రైతులకు ఇంకా ఒక్క రూపాయి కూడా బోనస్ అందకపోవడం శోచనీయం. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం 18 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా సన్న ధాన్యం కొనుగోలు చేయగా, సుమారు రూ.1000 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉన్నది.

గత సీజన్‌లో రైతులు అధిక మొత్తంలో సన్నాలు సాగు చేశారు. కానీ, గత సీజన్‌లో బోనస్ చెల్లింపులో ఆలస్యం జరగడం, చాలామంది రైతులకు బోనస్ రాకపోవడంతో ఈ సీజన్‌లో దొడ్డు వడ్ల సాగు వైపు అన్నదాతలు మొగ్గుచూపారు. బోనస్ వస్తుందనే ఆశతో సన్నాలు సాగు చేసిన అన్నదాతలకు ఇప్పుడు కూడా భంగపాటు తప్పడం లేదు.

మరోవైపు రుణమాఫీ విషయంలోనూ రైతులను కాంగ్రెస్ దగా చేసింది. రుణమాఫీ కాలేదని ఎంతోమంది రైతులు ఇప్పటికీ అధికారులు, బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. రైతుబంధు పేరును రైతు భరోసాగా మార్చడంలో చూపిన ఉత్సాహాన్ని దాని అమలులో మాత్రం కాంగ్రెస్ సర్కారు చూపడం లేదు. ఎకరానికి రూ.7,500కు బదులు మాట తప్పి ఇస్తామన్న రూ.6 వేలు కూడా ఇప్పుడు అందడం లేదు. పెట్టుబడిసాయం ఎగవేయడంతో అన్నదాతలు అప్పులపాలవుతున్నారు. మరోవైపు అకాల వర్షం, వడగండ్ల వాన కారణంగా నష్టపోయిన అన్నదాతలకు నష్టపరిహారం అందడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన సుమారు 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలి. ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్ ఇవ్వాలి. లేకపోతే రాబోయే రోజుల్లో లక్షలాది మంది రైతులు పోరుబాట పట్టడం ఖాయం.



రేపటికి రూపం లేదు!

విమాన దుర్ఘటన చూశాక దాని ప్రభావం గురించి ఆలోచించకుండా ఉండటం కష్టమనిపిస్తున్నది. ఎన్నో, జీవితాలు, ఎన్నో కథలు ఒక్క క్షణంలో ఆవిరైపోయాయి. జీవితానికి గ్యారెంటీ లేదు, అది అరువు తెచ్చుకున్నది. అందుకే, కోపాన్ని తగ్గించుకొని 'నా' అనేవాళ్లతో ప్రేమతో మెలగండి. ఎందుకంటే, రేపటికి రూపం లేదు.

- హర్ష్ గోయెంకా, వ్యాపారవేత్త